కదం తొక్కుతాం..

కాసాని జ్ఞానేశ్వర్‌ను గుండెల్లో పెట్టుకుని గెలిపించుకుంటాం

కాంగ్రెస్ నేతల కుట్రలను ఛేదిస్తాం

చేవెళ్ల గడ్డపై బీసీ బిడ్డను గెలిపించుకుంటామంటున్న బీసీ సంఘాల నాయకులు

చేవెళ్ల లోక్‌సభ పోరాట పథంలో కదం తొక్కుతామని బీసీ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల కుట్రలు, కుతంత్రాలను ఛేదిస్తామంటున్నారు. బీసీల దశ, దిశను మార్చి అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అలుపెరగని పోరాటం చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తున్నారు. పార్టీలు, గుర్తులతో సంబంధం లేకుండా చేవెళ్ల గడ్డపై బీసీ బిడ్డను గెలిపించి తీరుతామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇటువంటి అవకాశం మళ్లీ రాదని, ఇప్పటివరకు ఓటు బ్యాంకుగానే చూసిన కాంగ్రెస్ వంటి పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు.

- రంగారెడ్డి, మే 8 (నమస్తే తెలంగాణ)

బీసీలు చైతన్యాన్ని చాటాలి..

- ఆలూరి కుమార్, మాజీ సర్పంచ్ ,ఎల్కగూడ, మొయినాబాద్

బీసీలు చైతన్యం చాటే సమయం ఆసన్నమైనది. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు చెట్టుకొకరు పుట్టకొకరు కావడంతో ఐక్యత కొరవడింది. బీసీలు ఎవరికి వారు చీలిపోవడంతో రాజ్యాధికారం దిశగా వెళ్లడం లేదు. బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అలాంటి నాయకుడు పార్లమెంట్‌కు వెళ్తే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయి. బీసీ నేత కాసానికి ఓటు వేసి గెలుపించుకుందాం.

హ్యాట్రిక్ విజయం..బీఆర్ఎస్‌దే..

- ఆలూరి రమేశ్, కుతుబుద్దీన్‌గూడ, మొయినాబాద్

చేవెళ్ల గడ్డపై మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. జనాభాలో బీసీల శాతం ఎక్కువగా ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరుగడంలేదు. బీసీలు రాజకీయాల్లో ఎదిగేందుకు ఇది మంచి అవకాశం. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థిని భారీ మెజార్టీతో పట్టం కట్టి బీసీల బాలాన్ని చూపాలి. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తూ అగ్రవర్ణాల వారు రాజ్యాధికారాన్ని చేపడుతున్నారు. అందువల్ల ఇప్పుడు బీసీలందరూ ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి మన సత్తాను చాటాలి.

బీసీలు సంఘటితం కావాలి..

- పాలెమోని శ్రీలతాశ్రీహరి గూడూరు, కందుకూరు

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఈ లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి. ఆయనకు బీసీల సమస్యలు తెలుసు. అందువల్ల వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. బీసీలందరూ పార్టీలకతీతంగా సంఘటితం కావాల్సిన సమయం వచ్చింది. చేవెళ్ల గడ్డపై బీసీల సత్తాను చాటుదాం.

జెండాలను పక్కనబెట్టాలి..

-పొన్న అంజయ్య, ఆకులఅమైలారం ,కందుకూరు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించిన తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. వచ్చిన అవకాశాన్ని బీసీలందరూ సద్వినియోగం చేసుకుని..కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని అహంకారపూరిత నేతలకు తగిన గుణపాఠం చెప్పాలి. అందుకు బీసీలందరూ పార్టీలకతీతంగా.. జెండాలను పక్కనబెట్టి సంఘటితం కావాలి.

బీసీ నాయకుడిని చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తాం

- రమేశ్, మున్నూరు కాపు సంఘం నాయకుడు శంషాబాద్

బీసీ నాయకుడిని చేవెళ్ల ఎంపీగా గెలిపించుకుని మన సత్తాను చాటుదాం. ఎన్నో ఏండ్ల తర్వాత బీసీ నేతకు చేవెళ్ల నుంచి పోటీ చేసే అవకాశాన్ని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కల్పించడం సంతోషకరం. అందువల్ల బీసీలందరం ఏకమై కాసానిని గెలిపించి మన సత్తా.. ఐక్యతను చాటుదాం..

కారు గుర్తుకు ఓటేయాలి..

-సురేశ్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు శంషాబాద్

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు వెనుకబడిన కులాల అభివృద్ధికి మలుపు. బడుగు, బలహీన వర్గాల గొంతుకైన జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ టికెట్ కేటాయించడం అభినందనీయం. 96 కులాలను ఏకతాటిపైకి తెచ్చిన బీసీ నేతకు పార్టీలకతీతంగా ఓట్లు వేసి గెలిపించుకోవాలి. కాసానిని గెలిపించుకుంటే మన హక్కులను మనం సాధించుకోవచ్చు. ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలి.

సమస్యలు పరిష్కారమవుతాయి..

- విఠల్, పూలపల్లి గ్రామం, నవాబుపేట

బీసీలందరం ఐక్యంగా ఉండి ఈ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా కాసానిని గెలిపించి బీసీల ఐక్యతను చాటుదాం. ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉంటూ, బీసీల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారు. అలాంటి నాయకుడు పార్లమెంట్‌లో ఉంటే మన సమస్యలూ పరిష్కారమవుతాయి.

ఐక్యతను చాటాలి

పార్లమెంట్‌లో బీసీల గళాన్ని వినిపించాలంటే కచ్చితంగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలి. బీఆర్ఎస్ అధినేత బీసీ నాయకుడికి ఇచ్చిన అవకాశాన్ని బీసీలందరం సద్వినియోగం చేసుకోవాలి. అహంకారంతో మాట్లాడే నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసి మన ఐక్యతను చాటిచెప్పాలి. **- కృష్ణ, పూలపల్లి గ్రామం, నవాబుపేట మండలం**

బీసీ అభ్యర్థిని గెలిపిస్తాం..

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ ఎన్ని అడ్డంకులు సృష్టించినా చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీసీ ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. కొన్నేండ్లుగా అగ్రవర్ణాల వారు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు. అలాంటి నాయకులకు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో గుణపాఠం నేర్పుతాం. బీసీల ఐక్యతను చాటి తీరుతాం. పార్లమెంట్‌లో బీసీల తరపున మాట్లాడే అవకాశాన్ని కాసానికి ఇవ్వాలి. **- సున్నల తిరుపతియ్య, కామునిపల్లి, కులకచర్ల**

కాసాని గెలుపు ఖాయం

నిస్వార్థంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. స్వలాభం కోసం పార్టీలు మారి, టికెట్లు తెచ్చుకున్నంత మాత్రాన ప్రజలు ఆదరిస్తారనుకోవడం అవివేకం. తప్పుడు మాటలు, వాగ్దానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే నాయకులకు ప్రజలు తగిన బుద్ధిచెబుతారు. జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా కాసాని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అలాంటి నాయకుడు పార్లమెంట్‌కు వెళ్తే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయి.

- పరిగి అశోక్, చౌడాపూర్, కులకచర్ల

కాసానికి పూర్తి మద్దతు

బీసీల ఐక్యతతో చేవెళ్ల లోక్‌సభలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగుర వేస్తాం. బీసీల సత్తాను కాంగ్రెస్ పార్టీకి చూపుతాం. కులాలను కించపరిచేలా మాట్లాడటం, బీసీలను చిన్నచూపు చూస్తే సహించేదిలేదు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు పూర్తి మద్దతు ఇస్తాం.

-దొంతి శ్రవణ్ కుమార్, గంగారం, మాడాపూర్

కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం..

బీసీలందరూ ఐక్యంగా ఉండి కాంగ్రెస్ లాంటి పార్టీలకు మన బలమేంటో చూపుద్దాం. అందరం ఏకమైతే దేనినైనా సాధించొచ్చు. కాసాని లాంటి నాయకుడు పార్లమెంట్‌లోకి వెళ్తే నిరుపేదల సమస్యలు పరిష్కారమవుతాయి. బీసీలందరూ కలిసికట్టుగా కాసాని జ్ఞానేశ్వర్ వెంటే ఉండాలి. బీసీ నాయకుడిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం. **- సతీష్‌కుమార్ కొర్రర్, మియాపూర్**

బీసీల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

ఈ ఎన్నికలు బీసీల భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. అందువల్ల ప్రతి బీసీ బిడ్డా ఆలోచించి ఓటు వేయాలి. బీసీలకు గుర్తింపు తెచ్చిన కాసానిని గెలిపించి మన ఐక్యతను చాటాలి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల టికెట్ కేటాయించడం గొప్ప విషయం. అందువల్ల పార్టీలకతీతంగా ఏకమై కాసానిని పార్లమెంట్‌కు పంపిద్దాం. **- అనంతయ్య, గొట్టిగఖుర్ధు, బషీరాబాద్.**

బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం

బీఆర్ఎస్‌లోనే బీసీలకు ప్రాధాన్యమున్నది. ఆ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. కాసానిని గెలిపించి చరిత్ర సృష్టించాలి. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో పార్టీల నిర్ణయాల్లో మార్పు రావాలి. బీసీలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలంటే కాసాని గెలుపు ఒక్కటే మార్గం. ప్రతి బీసీ బిడ్డా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. కాసాని గెలుపు.. బీసీల ఐక్యతకు మలుపు కావాలి.

- అన్నపూర్ణ వైస్ ఎంపీపీ, బషీరాబాద్



దుండిగల్ : కేసీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

జనసంద్రమైన కేసీఆర్ రోడ్‌షో

గులాబీమయమైన దుండిగల్ చౌరస్తా

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
దుండిగల్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

దుండిగల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

జగద్గిరిగుట్ట,కుత్బుల్లాపూర్ మే 8:పార్లమెంటరీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో జరిగిన కేసీఆర్ రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు నేతృత్వంలో ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల నుంచే జనం భారీగా చేరుకోవడంతో పరిసరాలు గులాబీ వర్ణం పులుముకున్నాయి. కేసీఆర్ 8.30గంటలకు చేరుకోగా.. జననేతకోసం ప్రజలు ఆతృతగా ఎదురు చూశారు. ఆయన రాకతో తెలంగాణ బాపూ అంటూ నినాదాలు చేశారు. మహిళలు, వృద్ధులు సైతం తరలివచ్చి ప్రసంగమంతా విన్నారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతిమాటకు తమ గళం కలిపి నినదించారు. గండిమైసమ్మ చౌరస్తా నుంచి దుండిగల్ మీదుగా గాగిల్లాపూర్ వరకు జనంతో నిండిపోయింది. టైగర్ల వంటి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు తోడు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కేసీఆర్ సూచించగా.. అలాగేనంటూ జనం స్పందించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, కొంపల్లి, నిజాంపేటతోపాటు స్థానికంగా ఉన్న దుండిగల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ నేతలు సమన్వయంతో వ్యవహరించారు. రోడ్‌షో ప్రణాళికలో లేకున్నా అప్పటికప్పుడు భారీగా జనం, పార్టీ కార్యకర్తలు రావడంపై కేసీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. అర్ధగంట ప్రసంగం అనంతరం దుండిగల్ నుంచి పటాన్‌చెరు ప్రచారానికి కేసీఆర్ వెళ్లారు. కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రజలను ఉత్సాహపరిచారు.

10వరకు పోస్టల్ బ్యాలెట్

మియాపూర్, మే 8: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగనున్నది. తొలుత ఈనెల 3వ తేదీన మొదలై 8వ తేదీ వరకు గడువును నిర్ణయించగా, దానిని ఈనెల 10వ తేదీ వరకు పొడిగించారు. చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గంలో శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ ఆవరణలో ఓటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 4,082 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 3,333 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు హోం ఓటింగ్ సైతం జరగ్గా.. 222 ఓటర్లకు గాను 192 మంది ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ ఏఆర్‌వో స్నేహ శబరీష్ పర్యవేక్షణలో హోం ఓటింగ్ ప్రక్రియ సమర్ధంగా ముగిసింది.

పోలింగ్ కేంద్రాల్లో పరిశుభ్రత చర్యలు

మియాపూర్, మే 8:చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పోలింగ్‌కు కేంద్రాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే సెక్టోరియల్ అధికారులు పలు దఫాలుగా కేంద్రాలను పరిశీలించి కల్పించాల్సిన వసతులపై నివేదికలు సమర్పించారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా వాటి కల్పనకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరుగనున్న తరుణంలో కేంద్రాల్లో ప్రత్యేక పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట పరిసరాలను పరిశుభ్రం చేయడం, టాయిలెట్లను శుభ్రపర్చడం, అకాల వర్షానికి అక్కడక్కడా పేరుకున్న చెత్త ఇతర వ్యర్థాల తొలగింపు చేపడుతున్నారు. సంబంధిత సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రత్యేక పరిశుభ్ర చర్యలు నిర్వహించారు. ఓటింగ్ ముందురోజు నాటికి పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలను సంసిద్ధం చేయాలని అధికారులను నియోజకవర్గ ఏఆర్‌వో స్నేహ శబరీష్ ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ

దీప్తిశ్రీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కొండాపూర్, మే 8: అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జలమయమైన ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకూడదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. అకాల వర్షంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా ఏర్పడిన ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌లో జలమయమైన పలు ప్రాంతాలను ఆయన కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించి, సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఈదురు గాలులకు రోడ్లపై కూలిన చెట్లను వీలైనంత త్వరగా తొలగించి ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే వెంట చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, అధికారులు ఉన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

బాలానగర్, మే 8: శ్రీమదలర్మేల్‌మంగా పద్మావతీ సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్ల ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామివారి మంగళాశాసనములతో శ్రీమాన్ కోసూరి రామకృష్ణమాచార్యుల ప్రత్యేక పర్యవేక్షణలో స్వామివార్ల ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ కె.కొండల్‌రావు, పాలక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రెండోరోజు సుప్రభాత సేవ, నిత్యోపాసన, బలిహరణ, శ్రీవారికి అష్టోత్తర కలశస్నపనము, హారతినీరాజన మంత్ర పుష్పాదులు తదితర పూజలు వైభవంగా నిర్వహించారు.

హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ కె.కొండల్‌రావు తదితరులు

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి

కల్యాణినగర్ షటిల్‌కోర్ట్‌లో షటిల్ ప్లేయర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు.చిత్రంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, మే 8: మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం బాలానగర్ డివిజన్ కల్యాణినగర్‌లో గల షటిల్‌కోర్ట్‌కు ఆయనతోపాటు డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా షటిల్ కోర్ట్‌కు వచ్చిన షటిల్ ప్లేయర్స్‌ను మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కలిసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానికంగా గల కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేసి రాగిడిని గెలిపించాలని అమ్మవారిని వేడుకున్నారు.

– డివిజన్ పరిధిలోని కట్టమైసమ్మనగర్, అంజయ్యనగర్,జయశంకర్‌నగర్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచారు. కారుగుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఫతేనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.బాలాజీనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శిరీషబాబురావు, మాజీ కార్పొరేటర్ బాబురావు ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలు పంచి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కేపీహెచ్‌బీకాలనీలో డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డివిజన్ పరిధిలోని 6వ ఫేజ్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసానిని గెలిపించుకుందాం..: ఎమ్మెల్యే గాంధీ



మహాత్మాగాంధీనగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కొత్తగూడ గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మియాపూర్/కొండాపూర్, మే 8: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి బీసీ వర్గానికి చెందిన కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. రెండుసార్లు ఎగిరిన గులాబీ జెండా ప్రజల అండతో మూడోసారి కూడా ఎగిరేలా అండగా నిలవాలన్నారు. చేవెళ్ల అభ్యర్థి కాసానికి మద్దతుగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్ కాలనీ వాసులతో ఎమ్మెల్యే గాంధీ బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్లలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేవెళ్ల అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి పార్లమెంటుకు పంపాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీ నేతలు, మహిళా నేతలు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

– కొండాపూర్ : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఘన విజయం సాధిస్తాడని మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్ అన్నారు. జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం ఆయన కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ, కొండాపూర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దుండిగల్ చౌరస్తాకు విచ్చేసిన సందర్భంగా సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు. *– దుండిగల్, మే 8*

స్పాట్ బుకింగ్‌ను కొనసాగించాలి

మియాపూర్, మే 8 : శబరిమలలో స్పాట్ బుకింగ్ సదుపాయాన్ని నిలిపివేసేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేతి తిరుమలరావు కోరారు. దాని స్థానంలో ఆన్‌లైన్ బుకింగ్ పెట్టాలన్న ఆలోచన సరికాదని, దాని వల్ల అయ్యప్ప భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ మేరకు హైదర్‌నగర్‌లో తిరుమలరావు విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసుల వర్చువల్ క్యూ నుంచి పోలీసులకు అటు నుంచి ట్రావెన్ కోర్ నియంత్రణలోకి దర్శన విధానం పోయిందని, నాటి నుంచి సమస్యలు ప్రారంభమయ్యాయన్నారు. సీజన్‌లో తీర్థయాత్ర 12–18 గంటల వరకు భక్తులు క్యూ లైన్లోనే నిల్చోవాల్సి వస్తుందని తిరుమలరావు అన్నారు. తిరుపతి విధానాన్ని అనుసరించాలని ట్రావెన్ కోర్ దేవస్థానం చూస్తుందని, అక్కడ సకల సదుపాయాలను తిరుపతి కల్పించిందని, ఇక్కడ ఎటువంటి వసతుల్లేవన్నారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప దాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

దుండిగల్, మే 8: కూతురిని వెంటబెట్టుకుని ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ మరాఠీబస్తీకి చెందిన కూచనపల్లి శ్రీను, శిరీష(27) దంపతులు. వీరికి ఏడేండ్ల వయస్సు గల కూతురు లేఖ్యశ్రీ ఉంది. లేఖ్యశ్రీ ప్రస్తుతం 3వ తరగతి చదువుతుంది. శ్రీను డేకరేషన్ వర్కర్‌గా పనిచేస్తుండగా, శిరీష నగరంలోని ఎర్రగడ్డలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 6వ తేదీన లేఖ్యశ్రీ బర్త్‌డే ఉండటంతో తన కార్యాలయంలో పనిచేసే తోటి ఉద్యోగులు తమ కూతురును తీసుకురమ్మన్నారంటూ అదే రోజు ఉదయం 9 గంటల సమయంలో శిరీష తన కూతురిని వెంటబెట్టుకుని ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లింది. అయితే రాత్రి వరకు రాకపోవడంతో భర్త శ్రీను ఫోన్ చేయగా ఆఫీసులో కండ్లుతిరిగి పడిపోవడంతో దవాఖానలో ఉన్నానని, 7వ తేదీన ఉదయం వస్తామని చెప్పింది. మరుసటి రోజూ ఉదయం ఫోన్‌చేస్తే సాయంత్రం ఆఫీస్ ముగిశాక వస్తానన్న శిరీష, లేఖ్యశ్రీ మరుసటి రోజు రాత్రి వరకు కూడా తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన శ్రీను వారి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీశాడు. ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి